


# ఆకాశానికి నిచ్చెన

ఎస్. నూర్ అహ్మద్

**నేను ఆ ఇంట్లోకి అడుగుపెట్టేసరికి శంకరం మామ ఏదో దీర్ఘాలోచనలు చేస్తూ గాలిలోనే లెక్కలు వేస్తూ కనిపించాడు... తనకు ఎదురుగా కొంత నగదు మొత్తం కూడా పెట్టుకున్నాడు. కాబట్టి అవేవో డబ్బు బాపతు లెక్కలే అని గ్రహించాన్నేను...**



"ఏం, మామా ఏదో ఆలోచిస్తుండావే" అంటూ లోపలికి నడిచిన నేను అక్కడేసిన ఈత చాపపై కూలబడ్డాను.

"ఈసారి చింతపండు అమ్మితే కనీసం ఓ ఐదు వేలైనా మిగులుతాయనుకుంటి, కానీ అంతా పోను రెండువేలు కూడా చేతికి రాలేదు. దీనితో అప్పులు తీర్చుదునా? ఇల్లు గడుపుదునా? ప్చ్... ఏం చేయాలో ఏమిటో" నిస్పృహగా పెదవి విరుస్తూ నిట్టూర్చాడు శంకరం మామ.

ఆ ఇంటి స్థితిగతులేమిటో పూర్తిగా తెలిసిన నాకు మామ ఎందుకలా బాధపడుతున్నాడో అర్థం కాని విషయమేమీ కాదు... నా పరిస్థితి కూడా ఇంచుమించు అలాంటిదే కాబట్టి ఏం మాట్లాడలేక క్షణకాలం మౌనం వహించాను.

ఇంతలో మా మాటల్లో కల్పించుకున్నాడు శంకరం మామ కొడుకు శ్రీనివాసులు.

"ధరలు పెరక్కపోవడం కాదు బావా. వాటిని పెరక్కుండా అణచేస్తున్నారు దళారీలు. లేకపోతే పోయి నేడు ఐదు నూర్రుపాయలున్న మిర్చీ ఈ యేడు ఇన్నూర్రుపాయలు కావడమేంది... చింతపండు పోయినేడాది కంటే ఇంకో ముభై రూపాయలు తగ్గిపోవడమేంది... అసలా చింతపండు మార్కెట్లో మనలాంటి రైతుల్ని నిలువునా ముంచేస్తున్నారు...." ఒకింత ఆవేశంతో చెప్పుకొచ్చాడతను.

ఈ విషయంలో నేనేదో అనాలనేలోగానే మామ తనే బదులిచ్చాడు.

"ఛత్... ఊర్కోరా ఎప్పుడూ వెధవ వాగుడేనా? ఆ మార్కెట్లో మోసం జరుగుతూ వుంటే ఇన్నూరు మైళ్ళ దూరం కాడి నుండి కూడా రైతులు ఆ మార్కెట్‌కే ఎందుకొస్తార్రా... ధరలు పెరగడం పెరక్కపోవడం మన తలరాతను బట్టి వుంటుంది. ధరలు రాకపోతే మన దురదృష్టం అని సరిపెట్టుకోవాల" అన్నాడు మామ.

"ఆ నువ్వలా అనుకోబట్టే నీ కడుపున పుట్టిన పాపానికి మా తలరాత ఇలా తగలడింది" విసుగ్గా అన్నాడు శ్రీనివాసులు.

"మామ చెప్పేది కూడా నిజమే కదా సీనా, ఆ మార్కెట్లో మోసం జరుగుతా వుంటే రైతులు అంతంత దూరం నుండి పనిగట్టుకొని రారు కదా? ఇక ధరలంటావా, మనం పండించే ఏ పంటకు గిట్టుబాటు ధరలున్నాయో చెప్పు అందుకే అసలు రైతంటేనే ఒక గొప్ప దురదృష్టవంతుడని అర్థం" అన్నాన్నేను అనునయంగా.

"అదేంది బావా నువ్వు కూడా అట్లా మాట్లాడుతావ్. అంతో ఇంతో చదుకున్నోడివి నువ్వూ అలాగంటే ఎలా" విస్మయంగా అన్నాడు శ్రీనివాసులు.

**"రైతుల్ని సంఘటితం చేయడమంటే అరచేతిలో వెంట్రుకలు మొలిపించడం... ఆకాశానికి నిచ్చెన వేయడం కంటే కష్టమైనది. అందుకే అది ఈ జన్మలో జరగదు".**

దానికి నేనేమీ బదులు చెప్పకుండా ఊరుకున్నాను. ఇంతలో లక్ష్మమ్మత్త అందించిన గిద్దెడు కాఫీ మౌనం గానే అందుకొని తాగి అక్కడ నుండి బయటపడ్డాను.

* * *

ఆ రోజు ఉదయాన్నే ఏం చేయాలో తోచక మూడు రోజుల క్రితం నాటి పాత పేపరు తిర గేస్తూ పరధ్యానంగా కూర్చున్న నేను శంకరం మామ రాకను గమనిం చకపోయినా మా ఆవిడ చూసి "రా పెద్నాయనా!" అని ఆహ్వా నించి చాప దులిపి వేయడంతో నేను కూడా ఆలోచనల నుండి తేరుకొని మామను చిరునవ్వుతో ఆహ్వానించాను.

"ఏం మామా గాలిట్లా మళ్ళింది..." నవ్వుతూ అడిగా న్నేను.

"నిన్ను చూద్దామనే వచ్చాన




ల్లుడూ..." చిరునవ్వు చిందిస్తూ చిద్విలాసంగా చెప్పాడు మామ.

వాస్తవానికి నాకు ఆయన స్వంత మామేమీ కాదు. ఆ మాట కొస్తే ఆయన మతం, నా మతం వేర్వేరు. కానీ మతమేదైనా మనిషన్నాక వచ్చే కష్టాలు ఒకటే కాబట్టి కుల మతాలు మర్చిపోయి ఒకరి కష్ట సుఖాలు ఒకరు చెప్పకుంటూ మనసు విప్పి మాట్లాడుకుంటూ, వరసలు కలిపి పలుకరించుకోవడం మా రాయల సీమ పల్లెలో ఇప్పటికీ మిగిలున్న ఒక అపురూప సాంప్రదాయం... ఆ రకంగానే మేమిద్దరం మామా. అల్లుళ్ళం...

కాసేపు అవీ ఇవీ పిచ్చాపాటీగా మాట్లాడాక నేనే అసలు విషయం లోకి దిగాను.

"మామా, నీకు తెల్సు కదా. నా చింత తోపులోని చెట్లు తొలిసారిగా కాపుకొచ్చాయి. ఆ చెట్లకు తోడుగా పీరా సాబు నుండి కౌలుకు తీసు కున్న చెట్లు కూడా కాపు కాసాయి. వాటినంతా పీకించి, చింతపండు కొట్టించడానికి డబ్బే అందడం లేదు. అందుకే ఏం చెయ్యాలో పాలుపో వడం లేదు..." అన్నాన్నేను.

"ఇందులో ఆలోచించడానికి ఏముంది. మన్నం మార్కెట్ కాడి కెళ్ళి ఏ యాపారిని అడిగినా మనకు రెన్నెల్ల ముందే సరుకుపై అప్పిస్తాడు. అది తెచ్చి పండు కొట్టించి మార్కె ట్‌కు తోలుదాంలే..." భరోసా ఇచ్చాడు మామ.

ఆ మాట కోసమే ఎదురు చూస్తున్న నేను "అయితే మార్కెట్టు దగ్గరికి ఎప్పడెల్దాం" అని ఆత్రంగా ప్రశ్నించాను.

DIWALI GREETINGS

**SHA AMICHAND TARACHAND & CO.**

NANDIPATI VARI STREET POST BOX NO: 120; VIJAYAWADA-1
Phones: 73456, 63739, 66482.

WHOLE SALER: BILT Ballarpur Industries Limited

UNIT: BALLARPUR, SHREE GOPAL, CHOUDWAR SEWA


SISTER CONCERNS:
AMICHAND PAPER CO
LALIT ENTERPRISES

Amir LE


VISITING CARDS
LALIT ENTERPRISES, VJA
BEST QUALITY * SNOW WHITE

Mfg.: "AMIR" Visiting Cards,
Envelops & Wedding Cards & Files.

# పల్లె రమ్మంటూంది



కాటు వేసే కాలుష్య సర్పం
వచ్చదనం నాగస్వరం ముందు తలవాలుస్తుంది
పర్యావరణం పరదా విప్పకుని
పసిమి ఛాయ ముఖంతో ఎదురొస్తుంది
పల్లె శరీరంలోకి పరకాయ ప్రవేశం చేస్తే
పసిడి నవ్వుల పెదవి పేరుపేరునా పలకరిస్తుంది
పల్లె మన తరతరాల వారసత్వ సంపద
పల్లె మన పంచప్రాణాల చెలికాడు
తాటిముంజెలా కొబ్బరినీరులా చెరకు పానకంలా నిమ్మపూల వాసనలా
పల్లె నవ్వు ఎంత కమ్మగా ఉంటుందనీ...
పల్లెలో వీథివీథినీ కలిపే రహదారి
మనిషినీ మనిషినీ కలిపే కరచాలనంలా ఉంటుంది
నగరమంతా తిరిగి తిరిగి
పలకరింపుల పరామర్శకు మొహం వాచి
పల్లె ఒడికి చేరగానే
పెదవి మీద గుమ్మపాల ధార కురుస్తుంది
ఉట్టిలోని వెన్నగిన్నె వీపు నిమురుతుంది
మజ్జిగ చిలికే కవ్వం చప్పుడు గుండె సంగీతమవుతుంది
పైరు సముద్రం నడుమ దీవిలా ఉంటుంది పల్లె
పాపాయి గుండెమీద పచ్చల హారంలా ఉంటుంది పల్లె
తాటాకు చాపమీద ఆరబెట్టిన మామిడి తాండ్రతోనూ
ముసలమ్మ గంపలోని ఉడకబెట్టిన చిలగడ దుంపలతోనూ
చూపు జత కట్టినప్పుడు
పల్లె మనల్ని భుజంమీద చెయ్యేసి బాల్యంలోకి లాక్కుపోతుంది



మస్తాన్ తాత భుజంమీద సవారీ ఇప్పటికీ గుర్తొస్తుంది
డేవిడ్ సైకిల్ బెల్లు ఇప్పటికీ చెవుల్లో మోగుతుంది
తాటి చెట్టుమీద కల్లు గీసే యువకుడూ
పొలంలో నడుం వంచిన అమ్మాయీ
కనుపాపల్లో బొమ్మల కొలువు తీరుతారు
చెరువులో చెట్ల ప్రతిబింబాలూ
పట్టెమీదుగా కాలవ దాటుతున్న పాదాల కదలికలూ
అత్యంతాద్భుత అవ్యక్తానుభూతి కావ్యాల్ని నిర్మిస్తాయి
నగరంలోకి సూర్యుడు ముందుగా పల్లెను పలకరించే వస్తాడు
వెన్నెల పల్లెలోనే అందమైన ఆడపిల్ల పలువరుసలా మెరుస్తుంది
రైల్లోనో బస్సులోనో
పల్లెను స్పృశిస్తూ పోతున్నప్పుడు
గొప్ప క్షణాలేవో జారిపోతున్నట్టు
గుండెలో గొడవ గొడవైపోతుంది
మామిడి కొమ్మకు వ్రేలాడే తేనెపట్టూ
జామకాయను కొరికే రామచిలుకా
ఈతమట్ట చివర ఊగే పిచ్చుక గూడూ
చెంగు చెంగున గెంతే కోడె దూడా
చేప పిల్లను వేటాడే తెల్ల కొంగా
ఏ కుంచెకూ అందని సజీవ చిత్రాలై చూపుల్ని కట్టేస్తాయి
శ్రమ జీవన తాత్వికత పునాదిగా పల్లె
ఒక విశ్వాస ఛత్రం నీడలోకి ఆహ్వానిస్తుంది
అనిర్వచనీయమైన ఆత్మీయతా దృశ్యాల వేదిక- పల్లె
దేశం చుట్టూ పేరుకున్న ఓజోన్ పొర- పల్లె.





– భగ్వాన్

"రేపుదయం బస్సు కెళ్ళి, సాయంత్రానికి తిరిగొచ్చేద్దాం" అన్నాడు మామ.

సరేనన్నాను నేను

* * *

ఆ మరుసటి రోజు ఉదయాన్నే నేనూ మామ మా ఊర్నుండి రెండు బస్సులు మారి మార్కెట్టున్న టౌనుకు చేరాం.

ఆ టౌన్ లోని పెద్ద వీథి వీథంతా వ్యాపారులే వున్నారు. ఆ వీథిలో వున్న ఇళ్ళల్లో అంతా బుట్టలు బుట్టలుగా పేర్చిపెట్టబడిన చింతపండు, రాసులు పోసిన మిరపకాయలు కన్పించాయి. పంటలు పండించే రైతులు పూరిపాకల్లోనూ, కూలి పోయే పాత మిద్దెల్లోనూ వుంటే వారి పంటలు అమ్ముకొనే దళారీల ఇళ్ళు లంకంత పాడవుగా, అష్టైశ్వర్యాలతో వుండడం మొదటిసారిగా చూస్తున్న నాకు ఆశ్చర్యం కలిగించింది.

అక్కడ మామ ఎప్పుడూ తాను పంటనమ్మే వ్యాపారి దగ్గరికి నన్ను పిల్చుకెళ్ళి అంతా తానే మాట్లాడాడు.

చల్లటి పంఖా నీడలో కూర్చున్న ఆ వ్యాపారి చిర్నవ్వు నవ్వుతూ ఎన్ని చెట్లు వున్నాయి? ఎంత పంట వుంటుంది? అనే విషయం కనుక్కొని క్యాలిక్యులేటర్‌పై లెక్కలు వేసుకున్న తర్వాత ఎంత కావాలి...? అని అడిగాడతను.

అంతకు ముందు నేను మామతో చెప్పినట్లుగా ఆయన రెండు వేలు అడుగుతాడనుకున్నా. కానీ మామ తనకో మూడు వేలు, నాకో మూడు వేలు ఇమ్మని అడిగాడు.

అతనంత మొత్తం ఇస్తాడా అని నేను సందేహిస్తున్నంతలోనే అతనే మాత్రం బదులు పలక్కుండా రెండు ప్రాంసరీ నోట్లపై సంతకాలు పెట్టించుకుని ఆరువేలు నగదును మామ చేతికిచ్చాడు.

ఆ నగదు అందుకున్న మేము అక్కడ్నుంచి బయటపడి ఆ మొత్తంతో కొన్ని సరుకులు కొని మళ్ళీ మా వూరికి వెళ్ళిపోయాం.

* * *

చూస్తుండగానే రెండు నెలలు గడిచిపోయాయి. చింతపండు అమ్ముకొనే సీజన్ కూడా అప్పుడే మొదలయ్యింది.

అందరు రైతులతో పాటు నేను

కూడా చెట్లలో చింతపండును రాల్చించేసి, పండు కొట్టించి శ్రేష్టమైన కరివులి చింతపండు చెక్కలుగా చేసి గోనె సంచేలలో గట్టాలు కట్టించేసాను.

సుమారు ఒక టన్ను బరువున్న ఆ చిం ండునంతా రెండు బస్సులు మారి మార్కెట్టుకు ఎలా తరలించాలా? అనే సమస్య కూడా లేకుండా ఆ వ్యాపారే ఖుద్దున లారీని పంపిస్తాడని మామ చెప్పడంతో బరువు తీరినట్లు నిట్టూర్చాను.

అవసరానికి నమ్మి డబ్బు అప్పగా ఇచ్చిందే కాకుండా మా సరుకు తీసు కెళ్ళడానికి ముంగిట్లోకి లారీని పంపిస్తున్న ఆ వ్యాపారి నిజంగా దేవుడే అన్పించాడు నాకు.

ఆరోజే పేపర్లో చూశాను మార్కెట్లో చింతపండు ధర మణుగు 150 రూపాయిలు వుందని, దాంతో నేను లెక్కలు వేసుకొని ఈసారి నా చేతికి కనీసం 15 వేలు అందుతాయని, అందులో ఖర్చులు పోను ఎనిమిది, పది వేల దాకా అందుతాయని, దాంతో నా కష్టాలు కొంత తీరుతాయని ఉబలాటపడ్డాను.

అందుకే మార్కెట్టుకు ఎప్పుడెప్పుడు వెళ్తామా? అని ఎదురుచూస్తున్నంతలోనే ఆ వ్యాపారి పంపిన లారీ వచ్చేసింది.

ఆ లారీలో నా చింతపండే కాకుండా, మామది, ఇంకా నాబోటి ఇతర గ్రామాలకు సంబంధించినదీ కూడా నిండుగా వుంది.

ఆ రోజు ఉదయం ఆరు గంటలకే మేమెక్కిన లారీ మార్కెట్టుకు చేరుకుంది.

* * *

ఆ సమయానికే మార్కెట్లో ఎన్నో లారీలు ఆగివున్నాయి. ఊహించడానికే వీల్లేనంత భారీ స్థాయిలో చింతపండు రాశులుగా పేర్చిపెట్టబడి వుంది. నేను ఆ మార్కెట్లోకి వెళ్ళడం కూడా ఇదే తొలిసారి కాబట్టి ఇంత చింతపండూ ఎవరు కొంటారా? అని ఆశ్చర్యపోయాను.

మార్కెట్లోకి వెళ్ళిన మా లారీ ఆగీ ఆగగానే హమాలీలు పైకెక్కి లారీలో బస్తాలుగా పేర్చి వున్న చింతపండును ఆ వ్యాపారి మండీ ముందు దింపిపెట్టారు.

చింతపండు దింపిన తర్వాత ఆ కూలీలకు వ్యాపారే డబ్బు ఇస్తాడన్నాడు మామ. హమాలీలు కూడా మా దగ్గర కూలి డబ్బులు అడగలేదు కానీ చింత పండు బస్తాలు విప్పిన వెంటనే ఒక్కొక్క గోతాం నుండి సుమారు రెండు, మూడు కేజీల చింతపండు తీసేసుకున్నారు.

ఆ పనికి ఆశ్చర్యపోతున్న నేను వారికి అభ్యంతరం తెలిపేలోగా శంకరం మామే నన్ను అడ్డుకున్నాడు.

"నీకేం తెలియదు. ఊరుకో అల్లుడూ, వాళ్ళకు మనం కూలి డబ్బులేమీ ఇవ్వడం లేదు కదా, అందుకే కాసింత చింతపండు తీసుకున్నారు" అని నన్ను సమాధానపర్చాడు.

చింతపండు రాశుల వేలం మొదలయింది. మార్కెట్ నిబంధనల ప్రకారంగా అన్ని రాశులూ వేలం వేస్తారనుకున్న నన్ను ఆశ్చర్యపరుస్తూ మార్కెట్ అధికారులు మండీలలో ఒకటి రెండు రాశులు మాత్రం అదీ నామమాత్రంగా వేలాలు వేసి వెళ్ళిపోయారు.

"ఇదేంటీ... వాళ్ళు అన్ని రాశులు వేలం వెయ్యకుండా వెళ్ళిపోతున్నారే..." అని అడిగాన్నేను మామను ఉద్దేశించి.

ఆ మాట మామకంటే ముందుగా అక్కడున్న వ్యాపారికి విన్పించినట్లుంది. అందుకే తను బదులిచ్చాడు.

"నువ్వీ మార్కెట్టుకి మరీ కొత్తవాడిలాగున్నావే. ఇక్కడ ఒక్కోసారికి రెండు, మూడు వేల రాశులు మార్కెట్టుకు వస్తాయి. దాన్నంతా వేలం పాడాలంటే ఒకటి రెండు రోజుల్లో అయ్యే పనేనా...?" చిద్విలాసంగా నవ్వుతూ అన్నాడతను. అందుకే రకానికి ఒకటి చొప్పున వేలం వేస్తారు... అర్థమైందా అన్నట్లుగా నా వైపు చూసాడతను.

అతను చెప్పిందీ నిజమేననిపించింది నాకు. అందుకే నేనేం మాట్లాడలేకపోయాను.

"ఆ రోజు మార్కెట్లో ఒకటో రకం కరివులి చింతపండు 160 రూపాయిలూ, రెండో రకం చింతపండు 120 రూపాయిలు ధరలు పలికాయి. నేనూ మామా తెచ్చిందంతా కరివులి చింతపండే కాబట్టి ఈసారి నేను అనుకున్నదాని కంటే కాస్త ఎక్కువ మొత్తమే అందుతుందని లోలోపలే సంబరపడ్డాన్నేను"

వ్యాపారి మా చింతపండును పరిశీలించి చూసి గట్టిపడ్డ చింతపండు లాట్లను గునపాలతో విడదీసి చూశాడు. ఆతర్వాత ఆ చింతపండులో బోటు కాయలు (రెండో రకం) కలుపబడి వున్నాయని నిర్ధారణకు వచ్చేసి మా సరుకునంతా రెండోరకంగా తేల్చేసాడు.

"కాదయ్యా. ఇదంతా మేలు రకం కరివులి చింతపండు" అన్నాన్నేను ఆవేశంగా.

"చాల్లేవయ్యా పెద్ద చెప్పొచ్చావు... మీ రైతులు చేసే మోసాలు మాకు తెలియనివి అనుకున్నావా? పైనంతా కరివులి చింతపండు పేర్చి లోపలంతా బోడుకాయలు పేర్చి తెస్తారు. ఏది నకిలీనో, ఏది అసలో మాకు తెలీదనుకున్నావా..." అన్నాడు ఆ వ్యాపారి.

దాంతో ఇంకేదో అనబోయిన నన్ను మామ పట్టి ఆపేసాడు.

"మామా... ఇతను మోసం చేస్తున్నాడు. మన సరుకును వేరే వ్యాపారికి ఇద్దాం పద" అన్నాను కాస్త ఆవేశం పెంచుకుంటూ...

ఆ మాటను ఆ వ్యాపారి ఎక్కడ వింటాడో అన్నట్లుగా మామ నన్ను కాసింత దూరానికి లాక్కెళ్ళాడు.

## 'పటౌడి' క్లీన్ బవుల్డ్

ప్రముఖ క్రికెట్ ఆటగాడు పటౌడిని ఏదో సంఘ సంక్షేమ కార్యక్రమం నిమిత్తం విరాళం అడగటానికి వచ్చారట కొంత మంది కార్యకర్తలు. పటౌడిని పెద్ద మొత్తంలో విరాళం అడిగారట. అయితే పటౌడి వారితో మాట్లాడుతూ "నా రెండు కళ్ళలో ఒకటి గాజు కన్ను. ఏది గాజు కన్నో మీరు తేల్చి చెప్పగల్గితే మీరు కోరిన విధంగానే విరాళం యిస్తాను" అని వారికో పరీక్ష పెట్టారట. వాళ్ళలో ఒక కార్యకర్త "ఎడం కన్నే" అన్నాడట వెంటనే. పటౌడి మెచ్చుకుని "శెభాష్...ఎలా చెప్పగలిగావ్ అంత ఖచ్చితంగా?" అని ప్రశ్నించారట. ఆ కార్యకర్త ఏమాత్రం తడుముకోకుండా "ఏముంది సార్....మీ రెండు కళ్ళల్లో ఎడమ కన్ను దయగలిగినట్టు కనబడుతుంటేనూ..." అన్నాడట తెలివిగా. అంతే నవాబ్ ఆఫ్ పటౌడీ నవ్వేసి తగిన విరాళం యిచ్చి పంపేరట వారిని.




భమిడిపాటి వెంకటేశ్వరరావు

# జెండా

నువ్వు ఆకాశంలో సమున్నతంగా రెపరెపలాడుతుంటే
మేం నీ నీడలో వున్నాం
గాలి నీ రూపం సూర్యుడు నీ మిత్రుడు
స్వేచ్ఛగా ఎగురుతావు
నేలను మాత్రం విడవకుండా
ఆకాశంలో నువ్వు రాసిన అక్షరాలు అందరూ గుర్తిస్తారు
నిరాడంబరంగా స్పష్టంగా తెలిసినట్టుంటాయి
కాని –
అవి, మా సజీవ వీరుల స్మృతులవలె అదృశ్యం!
నీ చిన్నరూపం మాకు యుద్ధ ప్రేరణ
యుద్ధానంతరం, నువ్వు చెక్కు చెదరవు
మేం మసి అయిపోతాం
నువ్వు కీర్తిలా శాశ్వతంగా నిలుస్తావు
అందరి హృదయంలో నువ్వే, గాఢాతి గాఢంగా
బాధామయ కాళరాత్రిని చీల్చుతూ
ఉదయాన్ని వీచుకుంటూ తెస్తావు
స్వాతంత్ర్యాన్నీ సంతోషాన్నీ పాడాలంటే – అది నీకే చెల్లును
నలుమూలల నుంచీ ముంచుకు రానున్న తుపానును
ముందుగా నువ్వే గుర్తిస్తావు
అందరి దిక్సూచివీ నువ్వే
నీ దయవల్ల విజయం సుస్థిరం, సురుచిరం
మేం నిన్ను ఆరాధిస్తాం, నువ్వే మా సర్వస్వం

చైనీస్ మూలం: మూ దా (1918–77)
ఆంగ్లం ద్వారా తెలుగు: డాక్టర్ మానేపల్లి

---

“నీకేమైనా పిచ్చి పట్టిందేమిట్రా. మనం ఆ వ్యాపారి దగ్గర అప్పు తీసుకున్నాం. అలాంటప్పుడు అతని అప్పు చెల్లగొట్టందే అతను మన సరుకును ఎలా ఎత్తనిస్తాడనుకున్నావ్... ఒక వేళ మనం సరుకు తీసుకుని ఇంకో వ్యాపారి దగ్గరికెళ్ళినా దాన్ని ఇంకోడె వడూకొనడు. ఎందుకంటే వాళ్ళకు సంఘం వుంది. వారిలో ఒకరి దగ్గరి నుండి తిరిగొచ్చిన సరుకు అంతకు మించిన ధరతో ఎవరూ కొనరు” అని వివరించాడు శంకరం మామ.

ఆ మాటలు విన్న నాకు 'ఏం చేయాలో తోచక మరోసారి గట్టిగా నోర్మూసుకున్నాను.

ఆ తర్వాత సరుకును తీసుకొమ్మని వ్యాపారితో చెప్పాడు మామ. నా ఆవేశంను గమనిస్తున్న ఆ వ్యాపారి ఏమనుకున్నాడో ఏమో గానీ నేను తీసుకువెళ్ళిన పది బస్తాల చింతపండులోని ఒక బస్తా చింతపండును మొదటి రకం చింతపండుగా లెక్క గట్టాడు. మిగిలినదంతా రెండో రకంగా నిర్ణయించాడు. ఆ తర్వాత మళ్ళీ చింతపండును తూకం వేయించి 100 కేజీల మొదటి రకం చింతపండుకు 160 రూపాయిల ధరలో 1600 రూపాయిలుగానూ, 700 కేజీల చింతపండును రెండో రకం ధరలో 8400 రూపాయిలుగానూ లెక్క కట్టి నాకు ఇవ్వాల్సిన మొత్తంను 10 వేలుగా లెక్క తేల్చాడు వ్యాపారి.

ఆ తర్వాత డబ్బులు ఎంచి నా చేతికి ఇచ్చాడు.

వాటిని ఎంచి చూసిన నాకు ఎలా ఎంచినా 5440 రూపాయిలే లెక్క తేలాయి. చింతపండు అమ్మగా నాకు రావాల్సిన 10 వేలలో వ్యాపారి అప్పు 3 వేలు పోయినా ఏడు వేలు రావాల్సి వుంది. అదే మాట అడిగాను వ్యాపారితో...

“అవునయ్యా, నీకు నా అప్పు పోను రావల్సింది ఏడు వేలే... కానీ నా 3 వేల అప్పుకి రెన్నెళ్ళ వడ్డీ... లారీలో సరుకు తెచ్చినందుకు నాలుగు శాతం రవాణా కమీషన్, కూలీల అన్‌లోడింగ్ ఖర్చు. నాకు రావాల్సిన ఎనిమిది శాతం కమీషన్ తీసేస్తే నీకు రావల్సింది సరిగ్గా అంతే” అంటూ అంకెలతో సహా లెక్క తేల్చేసాడతను.

ఆ వ్యాపారి దగ్గర తీసుకున్న అప్పుకు మూడు రూపాయిల వడ్డీ ఇవ్వాల్సి వుంటుందని, లారీకి బాడుగ, హమాలీలకు చింతపండు కాకుండా కూలీలు కూడా చెల్లించాల్సి వుంటుందని తెలీని నాకు ఆ వ్యాపారికి 8 శాతం కమీషన్ ఎందుకివ్వాలో మాత్రం అర్థంకాక అదే మాట అడిగాను.

“చూడయ్యోయ్... మేం మీ సరుకులు కొనే వ్యాపారులం కాదు. మేం కేవలం కమీషన్ ఏజెంట్లం మాత్రమే. ఎక్కడో బొంబాయిలోనో, ఢిల్లీలోనో వుండే వ్యాపారులు మా ద్వారా ఈ సరుకు కొంటారు. మేము ఈ సరుకు కొని వాళ్ళకు పంపిన తర్వాత 30 రోజులకు మాకు డబ్బులిస్తారు. మేము కూడా మీకు అలాగే నెల రోజులకు కాకుండా వెంటవే డబ్బు ఇచ్చేస్తున్నందుకు చెక్ డిస్కౌంట్‌లాగా ఈ కమీషన్ తీసుకుంటాం. అర్థమైపోయిందా...?” అని గద్దించాడా వ్యాపారి.

అతను చెప్పింది నాకు పూర్తిగా అర్థంకాకపోయినా నేను ఇంకేమైనా మాట్లాడితే నా కథ తేల్చడానికన్నట్లుగా అతని హమాలీలు సిద్ధంగా నిలబడ్డారు.

అందుకే ఏం చేయాలో తోచక, ఏమీ చేతకాని వాడిలా శంకరం మామతో కలిసి మార్కెట్ నుండి వెనుదిరిగాను.

'నా చేతిలో వున్న 5440 రూపాయల్లో పీరూ సాబ్ దగ్గర నే తీసుకున్న 10 చెట్ల కౌలుకు మూడు వేలా ఐదొందలు ఇచ్చేస్తే ఇక మిగిలిన రెండు వేలతో నా అప్పులకు వడ్డీ కూడా తెగదు. అందుకే ఈ ఏడాది అంతా మళ్ళీ కూలి నాలి చేసుకోక తప్పదు' అలా ఆలోచిస్తూ వెళ్తున్న నా చెవుల్లో...

“వ్యాపారస్థులకు సంఘంవుందిరా, అందుకే వాళ్ళేం చేసినా చెల్లుతోంది...” అనే మాటలే వినిపిస్తున్నాయి.

'అవును. వ్యాపారులకు సంఘం వుంది. కానీ అనంతమైన రైతులకే సంఘం లేదు. వారే సంఘాలైతే, సంఘటితమైతే ఇలాంటి అన్యాయాలు ఆగిపోతాయి. రైతుల బ్రతుకులూ బాగుపడతాయి'

నాతో పాటు నడుస్తున్న శంకరం మామతో నా మనసులోని ఈ మాటల్ని చెప్పాను.

ఆ మాట విని అంతవరకూ బరువైన గుండెలతో నడుస్తున్న మామ పిచ్చి నవ్వు నవ్వాడు.

“ఒరే ఈ మాటల్ని ఇంకెవరితోనూ అనొద్దు. ఎందుకంటే రైతుల్ని సంఘటితం చేయడమంటే అరచేతిలో వెంట్రుకలు మొలిపించడం... ఆకాశానికి నిచ్చెన వేయడం కంటే కష్టమైనది. అందుకే అది ఈ జన్మలో జరగదు” తన జీవిత సారమంతా రంగరించి చెప్పాడు శంకరం మామ. ఇంక నేనేం మాట్లాడగలను?